# బతుకు గోస

గొరుసు జగదీశ్వరరెడ్డి

అమావాస్యకు మూడ్రోజుల ముందు రాత్రి.

పదీ పదకొండు గంటల మధ్య సమయం.

అప్పుడే నగరం సద్దుమణుగుతోంది.

మనసంతా గజిబిజిగా వుంది. మాటిమాటికీ ఆ పరిసరాలే గుర్తుకొస్తున్నాయి. ఎందుకో తెలీదు! ఐదేళ్ళ క్రితం మూసిన గేటు నన్ను ఆహ్వానిస్తున్నట్లుగా ఎక్కడ్నుండో సంకేతాలు అందుతున్నాయి.

పోనీ... ఇది కలయినా కాదు. నన్ను నేను గిల్లి చూసుకున్నాను. కలంటే గుర్తుకొచ్చింది. ఈ ఐదేళ్ళుగా తరచూ ఓ పీడకల నన్ను వెన్నాడుతూనే వుంది. 'పెద్ద పడవలో అందరం ప్రయాణిస్తున్నాం. నడిసముద్రంలోకి రాగానే పెద్ద తుఫాను. పడవ తల్లకిందులైంది. మునిగినవాళ్ళు మునిగిపోగా, ఏ గడ్డిపోచ ఆధారమైనా దొరుకుతుందనే భ్రమలో పగలనక, రాత్రనకా మిగతా వాళ్ళం ఈదుతూనే వున్నాం... కల ఎప్పుడొచ్చినా తీరం కన్పించదు. అందరం మునుగుతూ, తేలుతూ, ఈదుతూ...'

ఇంగితం వద్దని వారిస్తోన్నా మనసు కాళ్ళని కంపెనీ వైపు దారి తీయించింది.

నేషనల్ హైవేకి పక్కనేవున్న మా కంపెనీని చూడగానే దుఃఖం తన్నుకొచ్చింది. ఆనాటి వైభవం తాలూకూ చిహ్నం ఒక్కటైనా వుంటే ఒట్టు!

శతాబ్దాల నాటికి పాడుబడిన కోటలా కన్పించింది. ఎప్పుడూ ట్యూబ్‌లైట్ల మధ్యన అద్దాల్లో అమరివుండే 'అనామిక వాచ్' బోర్డు ఇప్పుడు పగిలిన అద్దాల్లోంచి, ఎండావానలకు వెలసిపోయిన అక్షరాల్తో గాల్లో వేలాడుతోంది.


నా చూపు మరోవైపు తిప్పేను.

కంపెనీకి కుడిపక్కనున్న మర్రిచెట్టు కింద నిల్చున్నాను.

హైవేపైన అప్పుడప్పుడూ వెళ్తున్న లారీలూ, బస్సులు... సెకండ్ షిఫ్ట్ వదిలినట్టుగా ఆ కార్మిక వాడలో ఒకదాని తర్వాత మరొకటి సైరన్ల మోతలు.

ఆ తర్వాత కాసేపటికి సైకిళ్ళపైనా, స్కూటర్లపైనా, కాలినడకనా వెళ్తున్న కార్మికుల సందడి.

గేటుకు ఎడం పక్కనున్న




సెక్యూరిటీ గదిలో చిన్న బెడ్‌లాంపు వెల్తుతోంది.

మెల్లగా అడుగులు వేస్తూ గేటును సమీపించాను.

ఇన్నేళ్ళ తర్వాత ఆ గేటు పైభాగాన్ని తడుముతుంటే ఆపాదమస్తకం సన్నని వణుకు... గుండె వేగంగా కొట్టుకుంది.

ఎన్నివేలసార్లు ఈ గేటులోంచి అటూ, ఇటూ నడిచేను! కుర్చీలో ఏటవాలుగా పడుకొని, పాదాల వెనకభాగాన్ని నేలకు తన్నిపెట్టిన సెక్యూరిటీ గార్డు కొత్తగా కన్పించేడు. ఇరవై సంవత్సరాలుగా పనిచేసిన ఆ కంపెనీలో ఈ మొహాన్ని ఎన్నడూ చూసిన గుర్తులేదు.

అతన్ని నిద్రలేపాలనిపించలేదు.

పెద్ద గేటుకి పక్కనేవున్న చిన్నగేటు సగం తెరిచే వుంది.

శబ్దం కాకుండా మెల్లగా లోనికి నడిచేను.

నక్షత్రాల కాంతిలో గేటునుండి లోపలికి వెళ్ళే సిమెంట్ రోడ్డు అస్పష్టంగా వున్నా దారి తెలుస్తోంది.

అందమైన క్రోటాన్లతో, గులాబీలతో వుండే ఆ దారికిరుపక్కలా ఇప్పుడు పిచ్చిమొక్కలు, దుబ్బులు పెరిగి చీదరగా కన్పిస్తోంది.

కుడిపక్కనుండే విశాలమైన పచ్చిక మైదానం ఏదీ? తంగేళ్ళు, సర్కారు తుమ్మలూ మొలిచి... దరిద్రంగా వుంది. ఇక్కడే మా చివరి మీటింగ్ జరిగింది.

"నా ప్రియమైన కార్మిక సోదర సోదరీమణులారా! ఈ కంపెనీ మనదే. దీన్ని ప్రైవేట్‌పరం చేయటం, మూసివేయటం ఎవరితరం కాదు. ఎవరికీ హక్కులేదు. ఈ ప్రభుత్వం చేసే జిమ్మిక్కులు మనం నమ్మవద్దు. మీ వెంట నేనున్నాను. పోరాడుదాం రండి! నాలోని ప్రతీ రక్తపుబొట్టూ మీకోసం ధారపోస్తాను..."

ఇప్పటికీ ఆ మాటలు చెవుల్లో 'రిపీట్' అవుతూనే వున్నాయి. తన రక్తాన్ని, చమటనీ ధారపోసేడో లేదోగానీ, డబ్బుకి తొత్తయిపోయి కార్మికుల జీవితాల్తో చెడుగుడు ఆడేడు.

ఎన్ని పోరాటాలు...

ఎన్ని నినాదాలు...

గొంతులు చించుకుంటూ, రోడ్లవెంట నడుస్తూ...

సెక్రటేరియట్ ముందు పోలీసుల లాఠీలకు బలవుతూ...

ఇప్పుడు ఒక్కరూ కన్పించరేం!

మూడువేల కార్మికులం. ఒకే గూటి పక్షుల్లా వున్నవాళ్ళం. చెట్టుకొకరం, పుట్టకొకరంగా... ఇప్పుడేమయిపోయాం?

కీచురాళ్ళు చెవుల్లో గూళ్ళుకడుతున్నాయి.

నాకు ఎడం పక్కనుండే చింతతోపు కేసి చూసేను. నా కళ్ళకేదీ కన్పించడంలేదు.

అక్కడంతా పెద్ద చీకటి గుహలా వుంది.

ఆ చీకటిలో గిరికీలు కొట్టే మిణుగురులు తప్పించి మరేం కనిపించలేదు. నాపైనుండి తీతువు 'క్రీర్ క్రీర్' మని ఎగురుకుంటూ వెళ్తుండగా, కాళ్ళమధ్య నుండి సర్రసర్రమని పొడవాటి పాము పాకుతూ పొదల్లోకి దూరింది.

అదిరిపడి వెనక్కి అడుగువేసాను.

ఎదురుగావున్న బాదం చెట్టు ఎండిన ఆకులు నా కాళ్ళకింద పలపల శబ్దం చేస్తున్నాయి. ఎర్రని తివాచీ పరిచినట్లుండే రెండరచేతులంతేసి రాలిన బాదం ఆకులు పగటివేళ సింధూరపత్రాల్లా కన్పిస్తాయి.

వాటికి అంత అందమైన రంగు ఎలా వస్తోంది... ఇప్పటికీ ప్రశ్నే! మధ్యాహ్నం భోజనాలనంతరం సైరన్ మోగడానికి మిగిలిన పదినిముషాల సమయంలో...

ఈ బాదం చెట్టు నీడలో తచ్చాడుతూ, పళ్ళకోసం రాళ్ళు రువ్వుతూ, కబుర్లు, జోకులు, నవ్వుల పువ్వులు విరగబూసేవి.

బాదం చెట్టుకు కాస్త ఎడంగా ఊడుగ. ఇప్పుడింకా దట్టంగా, గుబుర్లతో విస్తరించింది.

పతంజలి కాబోలు తను చేసే వైద్యంలోకి ఊడుగ పండ్లు కావాలంటే... చెట్లకు నీళ్ళుపోసే శంకరమ్మ చేతిలో రెండ్రూపాయల్ని ఉంచితే... దోసెడు నల్లని ద్రాక్షల్లా వుండే పండ్లను కోసి ఇచ్చింది.

నడుస్తూనే వున్నాను...

ముందుగా టైం ఆఫీసు. పక్కనే పర్సనల్ డిపార్టుమెంట్.

ఆ గోడల్ని, తలుపుల్ని నా అరచేతులతో తడిమేను.

నెలలో రెండ్రోజులు హాజరై, నెలంతా డ్యూటీలో వున్నట్లు రాయించుకొని, పూర్తి నెలజీతం తీసుకునే యూనియన్‌లోని కొందరు ఇక్కడే ఎప్పుడూ తచ్చాడుతూ... ఈ డిపార్టుమెంట్ స్టాఫ్‌ని తమ గుప్పిట్లో పెట్టుకొని...

న్యాయం నాల్గుచేతుల్తో నడిచేది ఇక్కడ.

మళ్ళీ గేటు...

నాకు తెలీని ఇద్దరు సెక్యూరిటీ గార్డులు రెండు కుర్చీల్లో కూర్చొని, మత్తులో జోగుతూ, అప్పుడప్పుడూ కళ్ళు తెరిచి, పెదాల నుండి కారిన సొంగని మోచేత్తో తుడుచుకుంటూ... గాలిని నములుతూ మళ్ళీ నిద్రలోకి జారుతున్నారు.

ఐదేళ్ళక్రితం మూసిన కంపెనీని ఎవరికీ అప్పగించక, ఉన్న కార్మికులను బయటకి గెంటి, మరొకర్ని పనిలోకి తీసుకోకుండా... తుప్పుపడుతోన్న మిషన్లకు కాపలా దారులా!

ఎవరికీ అర్థంకాని తంతు.

వాళ్ళని దాటి ముందుకు వెళ్ళాను. కనుచూపుమేర కన్పిస్తోంది కారిడార్. కారిడార్‌కి అటూ, ఇటుగా వాచ్‌కేసుల్ని తయారుచేసే రకరకాల షాప్‌లు.

ఇప్పుడు నాకు అటు, ఇటుగా రెండు పంచ్ కార్డు మిషన్లు. ఐదేళ్ళ క్రితం ఆగిపోయిన గడియారాల్తో, దుమ్ముతో ముల్లులు, నెంబర్లు అలికినట్లు అయ్యాయి.

డ్యూటీ టైం అవగానే, అందరం కంపెనీ బస్సు మిస్సవుతుందనే ఆదుర్దాతో గబగబా పరిగెత్తుకొచ్చి క్యూలో నిల్చునేవాళ్ళం.

వాడెవడూ... గోపీనాథ్ అనుకుంటాను. విలన్‌లా క్యూలో నిల్చోక, ముందుకువచ్చి పంచ్‌కార్డు కొట్టేవాడు. వాడి బూతులకు భయపడి వాడికి దారి ఇచ్చేవారు.

దొంగ పంచ్‌లు షరా మామూలే!

పాపం! వాడిప్పుడు దేశంలో ఏ క్యూలో నిల్చున్నాడో... పంచ్‌కార్డు మిషన్లు దాటగానే యూనిట్ అసెంబ్లీ సెక్షన్. ఎప్పుడూ ఎ.సి.లో వుండే ఆ షాపు అద్దాల్లోంచి చూసేను. లోపలంతా చిమ్మచీకటి.

ఇక్కడ్నుంచే వాచ్‌కేసులు కాంప్లెక్స్‌లోకి వెళ్ళి మిగతా వాచ్ పార్ట్స్‌తో అసెంబ్లీ అయ్యేవి. ఆ తర్వాత పాలిషింగ్ షాపు. వాచ్ కేసులకు మెరుగులుపెట్టే మిషన్లన్నీ దుమ్ము ముసుగుల్ని కప్పుకొని కునుకుతున్నాయి.

ఇప్పుడు నాకెదురుగా టూల్‌రూమ్. అందులోని సి.ఎన్.సి. మిషన్లు చచ్చిపడున్న ఏనుగుల శవాల్లా...

మిగతా ఏ షాపులోకైనా ఏటూల్ కావాలన్నా నిముషాల్లో తయారయ్యేవి మొదట్లో... కానీ, తర్వాతర్వాత ఏమైందీ!

బయటనున్న ఆన్సలరీల్లో చేయించడం మొదలెట్టారెందుకనీ ఆ:... గుర్తొచ్చింది. టూల్‌రూంలో పనిచేసే మేనేజర్ స్వంత ఇండస్ట్రీని పెట్టి, ఇక్కడ తయారవ్వాల్సిన టూల్స్‌ని తనే చేయించి, వర్కర్లకి పనిలేకుండా చేస్తూ... పర్చేజ్, అకౌంట్సు మనుషులతో కుమ్మక్కై...

కార్మికుల బతుకులు బస్టాండ్ పాలవడంలో వీడివంతెంతో...

ఎవ్వడూ నోరు మెదపని బహిరంగ రహస్యాలివి.

హమ్మయ్య! ఇప్పుడు నేను పనిచేసిన మిషన్ షాపు ముందుకు వచ్చి నిల్చున్నాను. ఎనిమిది అడుగులున్న పెద్దపెద్ద తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. వణుకుతున్న చేతివేళ్ళతో నొక్కిపట్టి నెట్టాను.

కిర్రుమని శబ్దం చేస్తూ మెల్లగా తెరుచుకున్నాయి.

కుడిపక్క తలుపు వెనకభాగాన అప్పటిదాకా వేలాడిన గబ్బిలం టపటప రెక్కలాడిస్తూ చీకట్లోకి పరిగెత్తింది.

లోపలికి అడుగువేస్తుంటే... శరీరం కంపించింది.

ఎడంపక్కనున్న లేత్‌మిషన్ చేతికి తగిలింది. తప్పిపోయిన ఆత్మీయమైంది ఏదో మళ్ళీ దొరికినట్లు ఉద్వేగంతో మిషిన్నంతా తడుముతున్నాను.

చేతుల్నిండా జిగురు, సన్నని దారాలు... మిషన్ మిషన్‌కీ మధ్యన బలంగా అల్లుకున్న సాలీళ్ళు.

ఈ చీకట్లోనే ఏ మిషన్ ఎక్కడుందో ఇప్పటికీ గుర్తించగలను. ప్రతీ మిషన్ పేరూ కంఠస్థమే.

మిషన్ల మోతల్లో, వర్కర్ల అరుపులతో... మేనేజర్లూ, సూపర్‌వైజర్లూ ఉరుకులు పరుగులు... ఏమైపోయాయి!

ఈ మిషన్‌పైన మియా కదూ వర్క్ చేసేవాడు....

**హఠాత్తుగా నా వెనకనుండి గిరగిరమని శబ్దం వినిపించేసరికి తుళ్ళిపడ్డట్టు వెనక్కి తిరిగేను. థ్రెడ్‌కటింగ్ మిషన్... దానంతకదే స్పిండిల్ తిరుగుతోంది. చూస్తుండగానే మిషన్‌లాంప్ వెల్గింది. భయంభయంగా మిషన్ కిందకు వంగి, ఎలా స్టార్టయ్యిందో చూస్తూ పైకి లేవబోతూ... అదిరిపడి అరవబోయాను.**

ప్రొడక్షన్ పెంచాలనే తాపత్రయంలో ఎన్ని పీసుల్ని రిజెక్ట్ చేసేవాడు!


టూల్ అరిగిపోయినా, మిషన్ ఆగేది కాదు. పని గబగబ కానిచ్చి, స్వంత వ్యాపారాల్ని వెలగబెట్టేవాడు.

ఇప్పుడు బయట చిల్లర వ్యాపారాలు చేస్తున్నాడేమో!

మిషన్లన్నీ... స్మశానంలో కదలక మెదలక వున్న గోరీల్లా కన్పిస్తున్నాయి. ఇలాంటి రోజులు వస్తాయని కలలోనైనా అనుకోలేదెవ్వరం. ఆకాశంలో చంద్రోదయం.

సన్నని వెన్నెలరేఖ గోడల పైభాగానున్న గుండ్రని కిటికీలగుండా లోపలికి వస్తోంది. ఇప్పుడు కొంతకొంత వెలుతురు పర్చుకుంటోంది.

కిటికీల్లో వున్న పావురాళ్ళు 'గూగూ' అంటూ అక్కడే తిరుగుతున్నాయి. ఒక దరిగావున్న అద్దాలున్న కేబిన్‌కి తాళం



వేసివుంది. అందులో జర్మనీ నుండి తెచ్చిన మిషన్లు. ఈ మిషన్లపై ట్రైనింగ్ కోసం శ్రీకాంత్, శ్రీనివాస్, జైపాల్... మరెవర్నో పంపేరు.

ఎన్ని లక్షలు... జపాన్‌లోని సీకో టెక్నాలజీ శిక్షణకు వెళ్ళేందుకు ముఖ్యమంత్రి నుండి ఢిల్లీమినిష్టర్ల వరకూ రికమండేషన్లు.

ఒకసారి ఆనందాన్ని, సంతోషాన్ని పంపాలని గొడవ జరిగింది. అప్పుడప్పుడే బయట దళిత ఉద్యమాలు ఊపందుకుంటున్నాయి. కేవలం అగ్రకులాల వారికి తప్పించి, దళితులకి ఛాన్సు రావటం లేదని గుమిగూడి మాట్లాడుకున్నారు.

ఆనందం, సంతోషం మధ్యలో మళ్ళీ వివాదం రేగింది. వీళ్ళిద్దరికీ వ్యతిరేకంగా మాట్లాడుతూ అప్పటిదాకా విడివిడిగా, కులాల వారీగా, నెలనెల డబ్బులు పోగేసి పిక్‌నిక్‌లు జరుపుకునే అగ్రకుల సంఘాలన్నీ ఒక్కటైపోయాయి.

"చంద్రం... వీళ్ళకు మాపైన ఇంతకసెందుకు. తరతరాలుగా తొక్కుతూనే వున్నారు. వీళ్ళ కులాల్లోనే శాఖలు వేరైతే పెళ్ళిల్లు కేన్సిల్ చేసుకుంటారు. పైగా అగ్రకులాలు, సంస్కారవంతులు... మా మాలమాదిగల్లో ఒకరంటే ఒకరికి పడదని ఎందుకా హేళనలు, ప్రచారాలూ. మా జాతికన్నా వీళ్ళలోని గొప్పతనం ఏమిటి?"

ఆనందం ఆవేదన నన్ను ఆలోచింపచేసిందప్పుడు.

అప్పుడప్పుడూ కులాల గొడవలు, మతాల గొడవలు, యూనియన్‌వీ... గందరగోళంగా వుండేది...

ఎన్నెన్నో జ్ఞాపకాల దొంతరలు–అన్నీ రీళ్ళలా కళ్ళ ముందు తిరుగుతుండగా పిచ్చిపట్టినట్లు మిషన్ల మధ్యన నేను...

ఒక్కసారిగా నా అడుగులు ఆగేయి.

అప్పటిదాకా అవిరామంగా అరుస్తున్న కీచురాళ్ళు ఒక్కుమ్మడిగా నిశ్శబ్దం పాటించాయి.

జరగబోతున్న వింతమార్పులకు ఆశ్చర్యంగా వుంది.

అప్పుడు విన్పించింది సన్నని కీచుస్వరం... ఒళ్ళు జలదరించింది. చుట్టూ కలయచూస్తున్నాను... ఎక్కడ్నుంచీ...

హఠాత్తుగా నా వెనకనుండి గిరగిరమని శబ్దం వినిపించేసరికి తుళ్ళిపడ్డట్టు వెనక్కి తిరిగేను.

థ్రెడ్‌కటింగ్ మిషన్... దానంతకదే స్పిండిల్ తిరుగుతోంది. చూస్తుండగానే మిషన్‌లాంప్ వెల్గింది. భయంభయంగా మిషన్ కిందకు వంగి, ఎలా స్టార్టయ్యిందో చూస్తూ పైకి లేవబోతూ... అదిరిపడి అరవబోయాను.

'ఎదురుగా గోపాల్' కళ్ళప్పగించి చూస్తున్నాను.

"గోపాలన్నా" అప్రయత్నంగా అన్నాను. నోరు తడారిపోయింది.

మిషన్ ఆగింది. గోపాల్ నా కళ్ళల్లోకి చూసేడు.

"చంద్రం..., నివ్వెప్పుడొచ్చినవ్" నా కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అన్నాడు.

ఆశ్చర్యం! గోపాల్ కళ్ళ స్థానంలో లోతైన గుంతలు కన్పిస్తున్నాయిప్పుడు. దవడెముకలు, పళ్ళు తప్పించి చర్మం లేదేమిటీ... మనిషి గాల్లో తేలుతున్నట్లు ఊగుతున్నాడు.

"చంద్రం... గీ మిషను అమ్ముతరంటగదా, అమ్మొద్దని చెప్పు. నాకు గీ మిషనంటే ఎంత పానమో నీకెర్కలేదా! దీనిమీద ఎంత పొడక్షన్ దీసిన... ఇంగా ఎంత దీయమన్న దీస్తగానీ... అమ్మొద్దు; దీన్ని అమ్మినసుకో, నా పొట్టమీన గొట్టినట్టయితది. దినాం మిషనెక్కకుంటే పెయ్యంత ఎట్లో అయితది"

"గోపాలన్నా... నీవు ఆమధ్య ఆత్మహత్య చేసుకున్నావని..." నోరు అతికష్టంపైన పలికింది.

ఒక్క పెట్టున మిషన్లన్నీ రన్నయినట్లు భీకరంగా నవ్వేడు గోపాల్. ఆ నవ్వు నా వెన్నులో చలిపుట్టిస్తోంది. క్రమేపీ ఆ నవ్వు చీకటి రాత్రుల్లలో కుక్కల రోదనలా మారింది.

"చంద్రం తమ్మీ! నేను చచ్చిపోయిన్నని ఎవలన్నరు? గీ దునియల బతికి వున్నంగ దినాం సస్తుంటి. నేను సచ్చినాంకనే ఆయిగ బతుకుతున్న..."

"ఆత్మహత్య పాపం గదన్నా..."

"పాపం, పున్నెం సంగతెవనికెర్క. కంపెన్ని మూసి, మన్లను రోడ్లమీదికి నూకినప్పుడు... గివన్ని గుర్తురాలే... యాభై ఏండ్లు దాటినోన్ని. పిల్లలు పెండ్లిల్లకున్నరు. వి.ఆర్.ఎస్. పైసలు ఎన్ని దినాలుంటయ్... గల్లిగల్లి దిరిగిన. గీ ముసలి వయిసుల ఏంపని చేస్తవన్నరు. ఒక్కడన్న దయజూపెనా చంద్రం....

పిల్లలు ఎదమీన కుంపట్లయిన్రు. నా పెండ్లం గీబుగులుకే మంచంల పడ్డది. మందులు తేనీకె పైసల్లేవు. ఉన్న ఉద్యోగం ఊడగొట్టిరి. ఇంగోతాన నౌకరన్న సూపకపోయిరి... ఎట్ల బతుకాలె?

నా పెండ్లం మంచంలనే సచ్చిపాయె... నేనే మందులు గొనలేక సంపుకున్న..." గోపాల్ చెప్పటం ఆపి, ఏడుపు మొదలెట్టాడు.

"ఏడ్వకు గోపాలన్నా, లోకంలో బత్కడానికి ఎన్ని మార్గాల్లేవు? గుండె ధైర్యం అవసరం...ఎలాగైనా బతకగలగాలి"

"గుండె దయిర్నం యాడికెళ్ళి వస్తదే చంద్రం. నూర్రూపాయల జీతం కాడికెళ్ళి ముప్పయి సమ్మస్సరాలు కొలువుజేసిన. ఇర్వయేండ్లు పొద్దు తెల్వకుంట బతికినం. జీతం తక్కువున్నగాని గింత గాచ్చారం లేదుగప్పుడు.

గీ పదేండ్ల సంది ఏమన్న గోస వెడ్తున్నరా... అరెరెరెరే...

"గీ కంపెన్లకొచ్చినాంకనే పెండ్లి జేసుకున్న. పిల్లలగన్న. ఏమంట పిల్లలు పెద్దగైకుంట వచ్చిన్రో... నెత్తిన శనిపట్టినట్లు కంపెన్ల కష్టాలు మొదలాయె. నేను మొదట్ల ఫ్రిజ్జులు తయారుచేసేదాంట్ల వున్నింటి. కంపెన్ని ముందగాల తున్కలు జేసిరి. అందర్ని విడదీసిరి... గిట్లనేగదా గీళ్ళు షురూజేసి నాశనం బట్టిచ్చింది. గిట్ల తున్కలు చేసెటైంల ఎన్ని మత్లబులు నడిసినయో నీకెర్కలేదా!

వి.ఆర్.ఎస్. అంటని ఏరిపారేసిరి. బస్సుల కంపెన్ని మూసేసిరి. ఎవన్కన్న పయివేటోనికన్నా ఇయ్యకుంట ఏక్దమ్‌న మూసిరి.

యాన్నో ఉన్నోని తానికిపోయి అప్పులు తెచ్చుడేందో, గాడు మన దేశంమీన జులూం చలాయించుడేందో... కంపెన్లు మూయమనుడేందో, పయివేట్ల అమ్మమనుడేందో... గిసొంటివి శాన వున్నయంటకదనే చంద్రం తమ్మీ!

ముందుగాల జీతాలు పెర్గకుంట జేసిరి. కాంటీన్ల బువ్వ వండుడు బంజేసిరి. నెలనెల జీతాలు టైంల ఇయ్యకుంట రెండ్నెల్లకోసారి ఇయ్యవట్టి.

వి.ఆర్.ఎస్. పత్రాలు నోటీసుబోర్డుల ఏసిరి. కంపెన్ని ఏంటికి మూస్తున్నరంటే... నష్టాలొచ్చినయన్నరు.

ఎట్లొచ్చినయ్ చెప్పకపోయిరి.

ఎట్లొస్తయి? అందినోడు అందినంత తినవట్టె.

ఎన్నడన్న గీళ్ళు జెప్పినపని సేయనన్ననా... యూనియనోళ్ళు, పిర్రలు బలిసినోళ్ళు పనిజేయకుంటే గాళ్ళను దీసెయ్యాలెగానీ, చెమటలు గారంగ పనిజేసిన గదనే... నేనేం పాపం జేసిన్నే... ఎవడో జేసిన తప్పుకు నాయసొంటోల్ల కడుపుమీన కొట్టిన్రు....

యా యూనియనోళ్ళన్న మనగోస ఇన్నరా చంద్రం తమ్మీ! ఇన్నట్లే ఇన్నరు, జేస్తం జేస్తమన్నరు... నోట్ల మన్నుగొట్టి పోయిన్రు..."

గోపాల్ ఇంకా ఏదో చెప్పబోతుండగా నాకు పదిగజాల దూరంలోవున్న ఎబోసా మిషన్ రన్నవడం మొదలెట్టింది. చూస్తుండగానే రాజు కన్పించేడు. ఎబోసా పై రాజు మంచి ఎక్స్‌పర్ట్. ఎన్నో ఏళ్ళుగా దాని పైన పనిచేయటంవల్ల ఏ రిపేరయినా తనే చేసుకునేవాడు.

"అగో చంద్రం తమ్మీ! ఎబోసా మీన రాజును సూసినవా, నేను సచ్చిన ఆర్నెళ్ళకే రాజు సచ్చిండు. ఒక దినం గిట్లనే నాతానికొచ్చి గోస ఎల్లవోసుకున్నడు. గాళ్ళమ్మకు భీమారంట. కంపెనున్నంత వరకల్ల ఊకున్నరంట, కంపెని మూసినాంక పెద్ద ఆపరేషన్ జేస్తమన్నరంట... కంపెని మూసినాక ఇ.యస్.ఐ యాడుంది? పయివేట్ల సూపలేక తల్లిని సంపుకున్నడు పాపం!

తల్లి పికరు వట్టింది. పెండ్లం పైసల్లేకుంట కాపరమెట్లసేతంటని దినాం రాజును సతాయించుడు, తిట్టుడు షురూ జేసింది. చాన దిక్కుల పనిజేసిండుగానీ... యాడ నిల్వనీయక పోయిరంట.

వున్నట్లుండి రాజు పెండ్లం కనవడకుంట పొయ్యింది... నీతోన కాపురం జేయలేనన్నదంట. గప్పట్సంది... గిట్ల పిచ్చోనోతీర్ల తిరుగుడు... ఓ దినం యాద్దప్పి రోడ్డుమీన నడుసుకుంట వోతుంటే... లారికింద పడ్డడంట..."

గోపాల్ చెప్పే ఒక్కోమాట నా గుండెలమీద సుత్తితో కొట్టినట్లుంది. మరికొంతసేపట్లో... మరో మిషన్ మొదలయ్యింది. దానిపైన దామోదరం.

అతని కథనూ గోపాల్ చెప్పబోతుండగా... నేనిక వినలేనట్లు చెవులు రెండూ మూసుకున్నాను.



"గోపాలన్నా సెలవుదీసుకుంటనే..." గబగబ అడుగులేస్తూ గేటు వైపు నడిచేను.

"చంద్రం తమ్మీ... నేను జెప్పింది యాదికున్నదా! ఎవన్కో గీ కంపెన్ని అమ్ముతరంట, అమ్మనీయకుంట సూడు..." గోపాల్ మాటలు వెనక నుండి వినబడుతుండగా మిషన్ షాపు దాటి కారిడార్‌లోకి వచ్చేశాను. ఒళ్ళంతా చెమటలు కారిపోతున్నాయి. గుండె వేగంగా కొట్టుకుంటోంది. మళ్ళీ బాదం చెట్టుదగ్గరకి వచ్చి నిల్చున్నాను.

"అమ్మా... అమ్మా... సుజా... సుజా..."నా అరుపంతా అరణ్య రోదనే! అసలు 'ఏంజరిగిందో' గుర్తుకొస్తుండగా... నా శరీరం దూదిపింజెలా తేలికైపోయింది

మామూలు మనిషినవడానికి చాలాసమయం పట్టింది.

గుండె దడ తగ్గుతుండగా... తొలికోడి కూసింది.

చంద్రుడు బూజుపట్టినట్లు మసగ్గా వున్నాడు.

మంచు కురుస్తోంది. తిరిగి నడక మొదలెట్టాను.

హైవే ఇప్పుడు చాలా నిశ్శబ్దంగా వుంది. గేటు బయటున్న మర్రిచెట్టు కిందకి చేరుకోబోతుండగా... హఠాత్తుగా కేకలు విన్పించేయి. మేన్‌ప్లేట్‌లో పనిచేసిన రమ నా ముందునుండే వెళ్ళి హైవేకి అడ్డంగా నిల్చుని ఏవో నినాదాలు చేస్తూ... రాస్తారోకో చేస్తోంది.

రమ దగ్గరగా వెళ్ళాను. నన్ను గుర్తించింది. తన మనసులోవున్న వేదనంతా వెళ్ళగక్కింది.

"చంద్రమన్నా! బతుకుమీన తీపి ఎవరికుండదు...నేను బలవంతంగ చావలేదు. ఇక్కడ ఉద్యోగం పోయాక ఇంట్లో గొడవలు రాజుకున్నాయి. రోజూ తాగే మా ఆయనకు చేతికి డబ్బు దొరక్కపోయేసరికి తన్నడం మొదలెట్టాడు. అది ఎంత నరకమన్నా... ఒకసారి తిరగపడ్డాను... ఏముందన్నా, కిరోసిన్ పోసి నన్ను నిలువునా కాల్చిచంపాడు..."

రెండు చేతుల్ని మొహంపైన కప్పుకొని ఏడుస్తోంది రమ. "ఆ దరిద్రుడు లేకపోతే నీకు జీవితమే లేదా, ఏ పని మనిషిగా నాలుగిళ్ళల్లో పనిచేసుకున్నా నీ జీవితం గడిచేది కదా... ఛ!ఛ! మీరంతా వట్టి పిరికివాళ్ళు, అదిగో లోపల గోపాలన్న, రాజు, దామోదరం... ఇక్కడ నీవూ..."

రమ ఏడుస్తూనే వుంది. నేను హైవేపైన మళ్ళీ నడక మొదలెట్టాను. తూర్పున సూర్యోదయం తాలూకు ఎర్రెర్రని రంగు. పక్షులన్నీ కిలకిలరావాల్తో చెట్ల గుబుర్లలో కదులుతున్నాయి.

నా కాళ్ళు ఇంటికి పరుగులు తీస్తున్నాయి.

నాకంటే ముందు ఒక గుంపు వెళ్తోంది. రాన్రానూ గుంపు పెరుగుతోంది. పక్కదారుల్లోంచి వచ్చిన జనం వాళ్ళల్లో కలుస్తున్నారు. మొదట్లో పదిమందిలా అన్పించిన జనం... వందలు, వేలుగా... రోడ్డంతా వాళ్ళే...

వాళ్ళ చేతుల్లో ఏవో కరపత్రాలు.

వాళ్ళకి దగ్గరయ్యాను-

"ఈ నేల మాదే"

"ఈ నీళ్ళు మావే"

"మా కంపెనీ మాదే... మేమే నడుపుకుంటాం"

"ప్రవేటైనా, మూసేసినా సహించం"

"మరొకడు జోక్యం చేసుకుంటే వాడికి పాడెకడ్తాం"

రకరకాల నినాదాలు... గాల్లో ప్రతిధ్వనిస్తూ విన్పిస్తున్నాయి.

మరో కంపెనీకి వేటు పడుతోందని అర్థం అయ్యింది.

వాళ్ళ నినాదాలు శ్రవణానందకరంగా వున్నాయి.

గుండె ఉప్పొంగుతోంది...

నగరంలో ధర్నా జరపబోతున్నట్లు తండోపతండాలుగా... యుద్ధవాతావరణం కన్పిస్తోంది నాకళ్ళకి.

గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాను.

వాళ్ళ ధైర్యాన్ని పొగిడాను.

ఆశ్చర్యం! నాతో ఎవ్వరూ మాట్లాడరు. నా ఉనికే తెలీనట్లు ప్రవర్తించారు.

నేను ఇంటికి వెళ్ళేసరికి సుజాత వరండాలో గోడకి ఆనుకొని నిద్రపోతోంది. పిల్లలు నేలమీద గాఢనిద్రలో వున్నారు.

"సుజాతా... సుజాతా" నా చేతుల్తో తన చెంపలపై తడిమేను. ఏ చలనం లేనట్టే కదల్లేదు.

మరింత గట్టిగా కేకేస్తూ కుదిపేను.

కదలదు-

"సుజా" దిక్కులు పిక్కటిల్లేలా అరిచాననుకున్నాను.

సుజా కదల్లేదు గానీ అక్కడికి అమ్మవచ్చి నిల్చుంది.

అమ్మ ఎందుకు వచ్చింది? ఎప్పుడొచ్చిందీ!

నన్ను గమనించనట్టుగానే సుజాతని తట్టిలేపింది.

వీళ్ళు ఎందుకిలా ప్రవర్తిస్తున్నారు... పిచ్చెక్కుతోంది.

సుజాత ఏదో గుర్తొచ్చినట్లు ఏడుస్తోంది.

ఎందుకేడుస్తోంది తను?

ఇదేవిటీ అమ్మకూడా సుజాతతోపాటూ ఏడుస్తోంది.

అమ్మ తలబాదుకుంటూ, గుండెలు అవిసేలా...

"నీవు లేకుంట ఎట్ల బత్కాలె కొడుకా...

గింత అన్యాయం జేసిపోతివి కొడుకా...

కరంటు సార్జీలు పెంచిండ్రంటివి కొడుకా...

కాట్లగల్వని కొడుకా...

గాడికి నీవెందుకు వోయినవు కొడుకా...

గాలొల్లిల నీవెందుకున్నవు కొడుకా...

అన్యాలంగ నిన్ను సంపిరి కొడుకా...

నీ పెయ్యి తుపాకుల తూట్లాయె కొడుకా...

ఇగ మమ్లనెవరు గాన్తరు కొడుకా...

గీ కడ్పుకోత ఎట్ల బరిత్తు కొడుకా..."

"అమ్మా... అమ్మా... సుజా... సుజా..." నా అరుపంతా అరణ్యరోదనే! అసలు 'ఏంజరిగిందో' గుర్తుకొస్తుండగా... నా శరీరం దూదిపింజెలా తేలికైపోయింది.

పొగమంచుని చీల్చుకుంటూ పైకి ఎగబాకుతున్న సూర్యుడు ఎర్రెర్రగా కన్పిస్తుండగా... నా ప్రమేయం లేకుండానే గాలి నన్ను స్మశానం కేసి లాక్కుపోసాగింది. ●